
సాక్షి ఒడిశా

బుధవారం । 8 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 3,99,897
వెండి	9 గ్రాముల 300 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



ప్రదర్శనలు అదుర్స్

పర్లాకిమిడిలో జిల్లాస్థాయి శిశు మహోత్సవం 'సురభి-2023' అదుర్స్ అనిపించింది. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

-10లో



గుట్కా తయారీ గుట్టురట్టు

గుట్కాను అక్రమంగా తయారుచేస్తున్న కర్మాగారంపై పోలీసులు దాడులు చేశారు. ముగ్గురిని అరెస్టు చేసి యంత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

-10లో

న్యూస్‌రీల్

ఓటర్ అవగాహన రథం ప్రారంభం



రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ విశాల్ సింగ్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో ఓటర్ అవగహన రథాన్ని జిల్లా కలెక్టర్ విశాల్ సింగ్ మంగళవారం ప్రారంభించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొత్తగా ఓటర్లు చేరేలా అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్టు కలెక్టర్ చెప్పారు. సక్రమంగా ఓటర్ల జాబితా తయారు చేయాలని, తప్పులు ఉంటే సరి చేయాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల అధికారులుగా నియమితులైన రాజ్ సాబ్, అదనపు కలెక్టర్ వెద్బర్ ప్రధాన్, జిల్లా అదనపు కలెక్టర్ త్రినాథ్‌మాఝి, మల్కన్‌గిరి సబ్ కలెక్టర్ అక్షయా ఖేముండు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది మృతి



సీనియర్ న్యాయవాది కె.గజపతి పట్నాయక్

కొరాపుట్: సీనియర్ న్యాయవాది కె.గజపతి పట్నాయక్(68) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం కన్నుమూశారు. నబరంగ్‌పూర్‌లోని పంజా వీధిలో ఉన్న తన స్వగృహంలో ఆయన తుదిశ్వాస విడిచారు. గజపతికి వివాహం కాలేదు. ఆయన సోదరుడు, జనతా వైద్యుడు కె.ధనుంజయ పట్నాయక్ కలిసి ఆయన ఉండేవారు. లాయర్ మృతి విషయం తెలిసిన వెంటనే సత్యసాయి సేవా సమితి, వాణిజ్య మండలి, జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు, తిరుపతి బాలాజీ మందిర కమిటీ సభ్యులు హాజరై సంతాపం తెలిపారు. వీరంతా అంతిమ యాత్రలో పాల్గొన్నారు. జిల్లా కోర్టుల సముదాయంలో న్యాయవాదులు సంతాప సభ నిర్వహించారు.

కలపను అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు



దుంగలతో పట్టుబడిన రాజేంద్ర హియాల్

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి అంబొదల అటవీ ప్రాంతంలో విలువైన కలపను అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు అటవీ శాఖ సిబ్బంది తెలిపారు. అతని నుంచి 11 విలువైన దుంగలను స్వాధీనం చేసుకున్నట్టు ఫారెస్టర్ సురేష్ చంద్ర పాత్రో తెలిపారు. స్వాధీనం చేసుకున్న కలప దుంగల విలువ సుమారు రూ. 40 వేలు ఉంటుందని అంచనా వేశామన్నారు. సోమవారం సాయంత్రం అంబొదల అటవీ రేంజ్ పరిధిలోని సంరక్షిత అడవుల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఒక మోటారు సైకిల్‌పై విలువైన కలపను తరలిస్తున్నట్లు గుర్తించి అతన్ని పట్టుకున్నామన్నారు. అతన్ని విచారించగా మునిగుడ సమితిలోని శారదాపూర్ పంచాయతీ పండరాముండ గ్రామానికి చెందిన రాజేంద్ర హియాల్‌గా గుర్తించామన్నారు.

ఫైరింగ్ కేసులో ముగ్గురు అరెస్టు



జైలుకు వెళ్లిన నిందితులు

జయపురం: జయపురం సమితి ఉమ్మిరి గ్రామంలో బ్లాంక్ ఫైరింగ్ కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి మంగళవారం తెలిపారు. ఉమ్మిరి గ్రామానికి చెందిన గౌతమ బాగ్(26), మహేంద్ర ఖోస్లా ఉరఫ్ రున(25), సొరగుడ వాసి రోహిత్ పాయికరాయ్ ఉరఫ్ సున(19)లను ఇదివరకే అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపించామని, రిమాండ్ గడువు పూర్తికావడంతో వీరిని జైలుకు పంపించామని పేర్కొన్నారు. గత నెల 24వ తేదీ రాత్రి ఉమ్మరిలో బ్లాంక్ ఫైరింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి వీరిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేశారు.

ధరలు పేలుతున్నాయ్!

- భారీగా పెరిగిన బాణసంచా రేట్లు
- గత ఏడాది కంటే 30 శాతం అదనం
- లైసెన్సు లేని షాపులను సీజ్ చేస్తున్న పోలీసులు



పర్లాకిమిడి: రాణిపేట రోడ్డులో బాణాసంచా షాపులు

బరంపురం: దీపావళి బాంబుల తరహాలోనే బాణసంచా ధరలు పేలుతున్నాయి. గత ఏడాది కంటే 30 శాతం రేట్లు పెరగడంతో కొనుగోలుదారులు బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా గంజాం జిల్లాలో బాణసంచా తయారీ యూనిట్లకు కలెక్టర్ లైసెన్స్‌లు ఇవ్వకపోవడంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. జిల్లా శివారున ఉన్న మామిడికాయల బజార్ రోడ్డులో నీలకంఠేశ్వర్ బాణాసంచా మార్కెటింగ్ సంఘం ఆధ్వర్యంలో 40 హోల్‌సేల్, 44 రిటైల్ దుకాణాలు ఉన్నాయి. గత ఏడాది రూ.500–రూ.700 పలికిన ఫ్యామిలీ ప్యాక్ ధర ఈ ఏడాది రూ.850–రూ.1500 వరకు పెరిగింది. తోక పటాసులు(వంద) గత ఏడాది రూ.25 కాగా, ఈ ఏడాది రూ.45 పలుకుతున్నాయి. లక్ష్మీబాంబుల ధర గత ఏడాది రూ.50 ఉండగా ఈ ఏడాది రూ.80కు పెరిగింది. కాకర వత్తులు, అగ్గిపెట్టెలు, భూ చక్రాలు, మతాబు.. ఇలా ప్రతి మందుగుండు సామగ్రి ధర భారీగా పెరిగింది.



బరంపురం: బాణసంచా షాపులో అమ్మకాలు

బాణసంచా యూనిట్ లైసెన్సుల రద్దు

బరంపురం : గంజాం జిల్లాలో ఈ ఏడాది బాణసంచా తయారీ యూనిట్లకు లైసెన్సులు ఇవ్వడం లేదని కలెక్టర్ కలెక్టర్ దివ్యా జ్యోతి పరిడా ప్రకటించారు. రెండు నెలల కిందట గంజాం జిల్లాలో వివిధ గ్రామాల్లో అక్రమంగా మందుగుండు సామగ్రి తయారు చేసేవారు. ఈ క్రమంలో భంజ్‌నగర్, నౌలగుంటా గ్రామాల్లో భారీ విస్ఫోటనం జరిగి ఇద్దరు మృతి చెందారు. ఈ నేపథ్యంలో తయారీ లైసెన్సులు రద్దు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.



బరంపురం: ధర పెరిగిన తోక పటాసులు



బరంపురం: మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న బాణసంచా

నిరాశలో వ్యాపారులు..

పర్లాకిమిడి: ఈ ఏడాది అనావృష్టి వల్ల పంటలు దెబ్బతినడంతో బేరాలు లేక బాణసంచా విక్రయదారులు నిరాశ చెందుతున్నారు. దీపావళి పండగ సమీపిస్తున్నా ఆశించిన అమ్మకాలు జరగడం లేదని స్థానికులు వ్యాపారులు చెబుతున్నారు. పర్లాకిమిడి శివారు ప్రాంతం, రాణిపేట రోడ్డులో దాదాపు 15 హోల్‌సేల్ దుకాణాలు ఉన్నాయి. సరిహద్దులో ఉన్న శ్రీకాకుళం జిల్లా కొత్తూరు, చాపర, నివగాం, కొరసవాడ, పాతపట్నం తదితర ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడి నుంచే మందుగుండు సామగ్రి కొనుగోలు చేస్తుంటారు. పర్లాకిమిడిలో పన్నుల తక్కువగా ఉండటంతో ఏటా విక్రయాలు బాగా జరిగేవి. అయితే ఈ ఏడాది మాత్రం అంతగా వ్యాపారాలు లేవని విక్రయదారులు చెబుతున్నారు.



బరంపురం: వాహనం సీజ్ చేసిన పెద్ద బజార్ పోలీసులు



బరంపురం : స్వాధీనం చేసుకున్న మందుగుండు సామగ్రి

10 లక్షల మందుగుండు సామగ్రి సీజ్

బరంపురం : పెద్దబజార్ పోలీసుస్టేషన్ పరిధిలోని త్రివేణినగర్‌లో లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.10 లక్షల విలువైన బాణసంచా స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ భూపతి మహంతి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి పెద్ద బజార్ పోలీసు స్టేషన్ పరిధి త్రివేణినగర్‌లో ఉన్న గోదాము వద్ద బజాజ్ మేక్సికో డల్లా వాహనంలో బాణసంచా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఈ దాడులు జరిపారు. అరెస్టయిన వారిలో నగరానికి చెందిన రబీ జెన్నా, శిబ సాహు, సూర్యనారాయణ, పితాంబర్ శెఠిలు ఉన్నారు.

మాజీ స్పీకర్ మహేశ్వర్ మహంతి కన్నుమూత

- నివాళులర్పించిన సీఎం నవీన్ పట్నాయక్



మహేశ్వర మహంతి (ఫైల్)

భువనేశ్వర్: బిజూ జనతాదళ్ (బీజేడీ) సీనియర్ నాయకుడు, శాసన సభ మాజీ స్పీకర్ మహేశ్వర్ మహంతి(67) మంగళవారం కన్నుమూశారు. స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున 3.25 గంటలకు మృతి చెందినట్లు ఆయన తనయుడు తెలిపారు. కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నెల 1న మెరుగైన వైద్యం కోసం భువనేశ్వర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి క్షీణించడంతో మంగళవారం తుదిశ్వాస విడిచారు.

అసెంబ్లీ ఆవరణలో అంతిమ దర్శనం

మహేశ్వర్ మహంతి భౌతికకాయాన్ని స్థానిక అసెంబ్లీ భవనం, బిజూ జనతాదళ్ (బీజేడీ) ప్రధాన కార్యాలయం శంఖ భవన్‌కు తరలించారు. ఈ ప్రాంగణాల్లో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో సహా పలువురు పార్టీ ప్రముఖులు, మంత్రులు, ఎమ్మెల్యేలు పార్థివ దేహాన్ని దర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. శాసన సభ ఆవరణలో ప్రభుత్వ లాంఛనాలతో గౌరవ వందనం సమర్పించారు.

రాష్ట్రాభివృద్ధిలో ముఖ్యపాత్రధారి

అధికార బిజూ జనతాదళ్ (బీజేడీ) ప్రధాన కార్యాలయం శంఖ భవన్‌కు చేరుకున్న మహేశ్వర్ మహంతి భౌతిక కాయానికి సీఎం నవీన్‌పట్నాయక్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వర్ మహంతి ప్రముఖ నాయకుడిగా పేరు తెచ్చుకున్నారని, నైపుణ్యం కలిగిన కార్యసాధకునిగా పేరొందారని గుర్తు చేశారు. రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని, స్వస్థలం పూరీ అభివృద్ధిలో ఆయన పేరు చిరస్థాయిగా ఉండిపోతుందని అన్నారు. ఆయన మృతి ఒడిశాకు తీరని లోటు అని ముఖ్యమంత్రి విచారం వ్యక్తం చేశారు.



శంఖ భవన్ ప్రాంగణంలో మహేశ్వర మహంతి భౌతిక కాయానికి పుష్ప గుచ్ఛం సమర్పించి నివాళులర్పించిన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

విద్యార్థి నాయకుడి నుంచి..

మహేశ్వర్ మహంతి రాజకీయ ప్రయాణం ఆదర్శప్రాయంగా సాగింది. ఆయన 1956 సంవత్సరం ఫిబ్రవరి 26న జన్మించారు. 2000 నుంచి 2014 సంవత్సరం వరకు పూరీ శాసన సభ నియోజకవర్గం నుంచి బిజూ జనతా దళ్ ఎమ్మెల్యేగా వరుస విజయాలు సాధించారు. 1995 సంవత్సరంలో జనతా దళ్ టికెట్‌పై తొలిసారి రాష్ట్ర శాసన సభకు ఎన్నికయ్యారు. మహేశ్వర్ మహంతి 2004 నుంచి 2008 వరకు రాష్ట్ర శాసన సభ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు. నవీన్ పట్నాయక్ కొలువులో అనేక శాఖలను నిర్వహించారు. వృత్తిరీత్యా ఆయన న్యాయవాది. స్థానిక ఉత్కళ విశ్వవిద్యాలయం నుంచి న్యాయ శాస్త్రంలో పట్టా పుచ్చుకున్నారు. బనారస్ హిందూ విశ్వవిద్యాలయం (బీహెచ్‌యూ) నుంచి రాజనీతి శాస్త్రంలో పోస్టుగాడ్యుయేషన్‌లో ఉత్తీర్ణత సాధించారు. పూరీ నుంచి ఐదుసార్లు ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆరు వేర్వేరు శాఖలకు మంత్రిగా పనిచేశారు. ఆయన విద్యార్థి దశ నుంచి అంచెలంచెలుగా రాష్ట్ర స్థాయి నాయకుని వరకు ఎదిగారు. 1973 సంవత్సరంలో పూరీ సామంత చంద్రశేఖర్ కళాశాలలో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మహేశ్వర్ మహంతి 1975లో బనారస్ హిందూ విశ్వ విద్యాలయం (బీహెచ్‌యూ) ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అనంతరం ప్రత్యక్ష రాజకీయ రంగ ప్రవేశం చేశారు. మహేశ్వర్ మహంతి 1978 సంవత్సరంలో పూరీ మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. అది మొదలుకొని క్రియాశీల రాజకీయాల్లోకి అడుగిడి తిరుగులేని నాయకునిగా వెలుగొందారు. 1982 నుండి 1985 వరకు పూరీ నగర సహకార బ్యాంక్ బోర్డు సభ్యుడిగా.. 1985 నుంచి 1990 వరకు, 1992 నుండి 1995 వరకు మహేశ్వర్ మొహంతి పూరీ మున్సిపాలిటీకి చైర్మన్‌గా కొనసాగారు. 2004 నుంచి 2008 వరకు ఒడిశా అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. బీజేడీ పూరీ జిల్లా శాఖ అధ్యక్షునిగా పార్టీని బలోపేతం చేయడంలో చురుకైన పాత్ర పోషించారు. పూరీ స్వర్గ ద్వార్ శ్మశాన వాటికలో మహేశ్వర మహంతి అంత్యక్రియలు నిర్వహించారు.



దివంగత స్పీకరు తనయుని ఓదార్చుతున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

ప్రముఖుల సంతాపం

రాష్ట్ర శాసన సభ మాజీ స్పీకరు మృతిపై గవర్నర్ రఘుబర దాస్, ఛత్తీస్‌గఢ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్, భారతీయ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ పండా తదితర ప్రముఖులు సంతాపం తెలిపారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుల నియామకం



డాక్టర్ సుబాష్ సాహు

బరంపురం: బీజేపీ జిల్లా అధ్యక్షులను అధిష్టానవర్గం నియమించింది. రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లాగా గుర్తింపు పొందిన గంజాం అధ్యక్షుడుగా డాక్టర్ సుబాష్ సాహు నియామకమయ్యారు. ఈయన గతంలో ఒడిశా రాష్ట్ర యువ మోర్చా కార్యదర్శిగా పని చేశారు. సుబాష్ సాహును పార్టీ శ్రేణులు అభినందించారు.

రాయగడ అధ్యక్షుడుగా శివకుమార్ పట్నాయక్



శివకుమార్ పట్నాయక్

రాయగడ: రాయగడ జిల్లా అధ్యక్షుడుగా శివకుమార్ పట్నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర శాఖ మీడియా సెల్ కార్యాలయం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. జిల్లా అధ్యక్షుడుగా శివకుమార్ పట్నాయక్ నియామకం కావడం ఇది రెండోసారి. 2015వ సంవత్సరంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్న ఆయన పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేశారు. రానున్న ఎన్నికల దృష్ట్యా పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. ఆయన నియామకంపై పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

సరిహద్దులో నాకాబందీ



దండకారణ్యంలో నదులపై రవాణా సాగించే ప్రాంతంలో పోలీసుల నాకాబందీ

కొరాపుట్: చత్తీస్‌గఢ్‌లో మొదటి దశ పోలింగ్ నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దులో పోలీసులు నాకాబందీ నిర్వహించారు. మంగళవారం కొరాపుట్ జిల్లా సరిహద్దులో ఒడిశా పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. జిల్లాకు సరిహద్దులో ఉన్న బస్తర్‌లో పోలింగ్ జరిగింది. ఈ ప్రాంతంలో మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే ఇక్కడ ఎన్నికలు బహిష్కరించాలని మావోలు పిలుపునిచ్చారు. దీంతో కేంద్ర బలగాలు అడవిలో పెద్ద ఎత్తున కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మావోయిస్టులు అడవుల్లో ముందుకు సాగుతున్నారని ప్రచారం జరుగుతున్నందున పోలీసులు నాకాబందీ నిర్వహించారు.



రాష్ట్ర సరిహద్దులో తనిఖీలు

నూతన మోటారు వాహన చట్టంపై అవగాహన




అవగాహన సదస్సులో జిల్లా జడ్జి తదితరులు



హాజరైన అధికారులు, న్యాయవాదులు

జయపురం: నూతన మోటారు వాహన చట్టసవరణపై అందరూ అవగాహన కలిగి ఉండాలని అధికారులు అన్నారు. జయపురం జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ సభాగృహంలో మోటారు వాహన చట్టం- 2022 సవరణపై కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధికారులు మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సర్వోన్నత న్యాయ స్థానం 2022 డిసెంబర్ 15వ తేదీన ఒక సివిల్ అపీల్‌పై ఇచ్చిన తీర్పును అమలు చేసే ఉద్దేశంతో అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. 2022 మోటారు చట్టంలో 11, 12 అధ్యాయాల సవరణలపై అవగాహన కలిగించేందుకు సదస్సును ఏర్పాటు చేశామని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షుడు సత్యనారాయణ మిశ్ర చెప్పారు. తొలిసారిగా సెప్టెంబర్ మూడు, రెండోసారి అక్టోబర్ 14వ తేదీన అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. సరోన్నత న్యాయ స్థానం ఆదేశం మేరకు మూడోసారి సచేతన వర్క్‌షాపును నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నిరుపేదలు, పీడితులు లబ్ధి పొందేందుకు వీలుగా అన్ని పోలీసు స్టేషన్ల అధికారులకు జిల్లా జడ్జి న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షులు సదస్సు ఉద్దేశాన్ని క్షుణ్ణంగా వివరించారు. జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి సుమన్ జెన పర్యవేక్షించారు. కార్యక్రమంలో కొరాపుట్ రీజనల్ ట్రాన్స్‌పోర్టు సహాయ అధికారి తపన్ బెటి, కొరాపుట్ జిల్లా బార్ అసోసియేషన్ జయపురం అధ్యక్షుడు బిరేష్ పట్నాయక్, కొరాపుట్ జిల్లాలోని పోలీసు అధికారులు, బీమా సంబంధిత న్యాయవాదులు పాల్గొన్నారు.

శివకుమార్ పట్నాయక్‌కు సన్మానం



శివకుమార్ పట్నాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రాయగడ: బీజేపీ జిల్లా అధ్యక్షుడుగా నియమితులైన శివకుమార్ పట్నాయక్ ను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఘనంగా సన్మానించారు. స్థానిక సిరికొన సమీపంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా సాధారణ కార్యదర్శి కిశోర్‌పండా, రాష్ట్ర శాఖ కార్యవర్గ సభ్యుడు బసంత కుమార్ ఉలక, బీజేపీ పట్టణ శాఖ ఉపాధ్యక్షురాలు మంజుల మినియాకపాల్గొన్నారు.

కాళీ ఉత్సవాలకు సన్నద్ధం



కోటాసింగ్ ప్రాంగణంలో తయారవుతున్న 30 అడుగుల కాళి మాత విగ్రహం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు కె. రాము, తదితరులు

బరంపురం : స్థానిక కొత్త బస్టాండ్ రోడ్‌లో ఈ నెల 12వ తేదీ నుంచి మా దక్షణ కాళీ ఉత్సవాలు ప్రారంభించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కె.రాము చెప్పారు. స్థానిక కొత్త బస్టాండ్ రోడ్డులో మంగళవారం శ్రీ దక్షణ కాళి పూజా కమిటీ ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు కె.రాము మాట్లాడుతూ ఈ ఏడాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం హోమం, రాజ భోగం, సాయంత్రం సంధ్యా హారతి, నామ యజ్ఞం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 30 అడుగుల కాళీ వీగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. కోల్‌కతా నుంచి శిల్పకారులు వచ్చి విగ్రహం తయారుచేస్తున్నారు.

క్లుప్తంగా

109 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన కార్లతో పాటు గంజాయి బస్తాలు.



కారులో దాచిన గంజాయి ప్యాకెట్లు

కొరాపుట్: స్థానిక పోలీసులు గంజాయి రవాణాను వినూత్న రీతిలో అడ్డుకున్నారు. సిమిలిగుడ పట్టణానికి సమీపంలో మంగళవారం వేకువజామున ఫుట్ సీల్ ఎకో రిట్రీట్ ప్రాంతంలో గంజాయి రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దాంతో పోలీసు పెట్రోలింగ్ బృందాలు అక్కడకు చేరుకున్నాయి. అక్కడ రెండు కార్లు అనుమానాస్పదంగా కనిపించాయి. వాటి వద్దకు పోలీసులు చేరుకోగానే గంజాయి వాసన వచ్చింది. అనుమానంతో చెక్ చేయగా ఆ కార్లు ఖాళీగా ఉన్నాయి. ఇంకా నిశితంగా గమనిస్తే బోనెట్, సీటు వెనుక భాగం, కారు కింద భాగంలో గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. కేవలం గంజాయి రవాణా కోసమే వాహనంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయడాన్ని పోలీసులు గమనించారు. ఈ దాడిలో 109 కిలోల గంజాయితో పాటు, రెండు వాహనాలను సీజ్ చేశారు. ఎస్‌డీపీఓ మనోజ్ శర్మ ఈ కేసు వివరాలు వెల్లడించారు.

ఆస్తి కోసం హత్య

- సొంత తమ్ముడ్ని కిరాతకంగా చంపిన అన్నయ్యలు!
- కేసరపడలో దారుణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న క్లూస్‌టీం



బద్రి ఖెత్రో(ఫైల్)

కంచిలి: ఆస్తి పంపకాల్లో ఏర్పడిన తగాదాలో వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. తమ్ముడ్ని సొంత అన్నయ్యలే కిరాతకంగా హత్య చేశారు. కంచిలి మండలం కేసరపడ గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా సంచలనం రేకెత్తించింది. వివరాల్లోకి వెళితే.. కేసరపడకు చెందిన బద్రి ఖెత్రో(32), వాసు, కూర్మారావు అన్నదమ్ములు. కొంతకాలంగా వీరి మధ్య ఆస్తి పంపకాల్లో గొడవలు జరుగుతున్నాయి. బద్రి ఖేత్రో మర్చంట్ నేవీలో ఉద్యోగం చేస్తుండేవాడు. ఆస్తి తగాదా కారణంగా ఏడాదిన్నరగా గ్రామంలోనే ఉండిపోయాడు. ఇతనికి గత ఏడాది ఫిబ్రవరి 12న ఒడిశా రాష్ట్రం జయంతుపురం గ్రామానికి చెందిన శిరీషతో వివాహమైంది. వీరికి మూడు రోజుల క్రితం మగబిడ్డ జన్మించాడు. భార్య శిరీషకు బరంపురంలోని క్రిష్టియన్ ఆసుపత్రిలో సిజేరియన్ జరగడంతో అక్కడే చికిత్స పొందుతోంది. బద్రి ఖెత్రో ఒక్కటే ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి తాళ్లసాగరం చెరువు వైపు బహిర్భూమికి వెళ్లగా సమీపంలో పంట పొలాల్లో అతికిరాతకంగా హత్యకు గురయ్యాడు. తల వెనుక భాగం, ఎడమ కాలు నరికేశారు. ఆస్తి పంపకాల్లో తగాదా వల్లే తన భర్తను వాసు, కూర్మారావులు హత్య చేశారని భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్‌ఐ ఎస్.బాలరాజు కేసు నమోదు చేశారు. సోంపేట సీఐ ఆర్. రవిప్రసాద్ సమక్షంలో విచారణ చేపడుతున్నారు. ఘటనా స్థలాన్ని కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి మంగళవారం పరిశీలించారు. శ్రీకాకుళం నుంచి వచ్చిన క్లూస్ టీం మృతదేహం వద్ద ఆధారాలను సేకరించారు. మృతదేహానికి సోంపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

మూలపేట పునరావాస కాలనీల్లో పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మూలపేట పునరావాస కాలనీల్లో పనులు త్వరితగతిన చేపట్టాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. పునరావాస కాలనీల్లో రహదారులు, కాలువలు, తాగునీటి సరఫరాపై జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్‌తో కలిసి కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్గత రోడ్లు, కాలువలను త్వరితగతిన నిర్మించాలన్నారు. పనులు నాణ్యతతో చేపట్టాలని ఆదేశించారు. నిధులు ఇప్పటికే మంజూరు చేసినట్లు వివరించారు. తేలినీలాపురం నుంచి పైపులైన్ల ద్వారా తాగునీరు అందించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్‌ఈ ప్రసాదరావు చెప్పారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్‌ఈ సత్యనారాయణమూర్తి, సర్వే శాఖ ఏడీ విజయ్‌కుమార్, డీఈ, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు శ్రీనివాసరావు, రామమూర్తి, ఏఈలు పాల్గొన్నారు.



మహిళా స్వశక్తీకరణపై మోహనా బ్లాక్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు



మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో 'సురభి' పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్



కోడలిని హింసిస్తున్న అత్త

ప్రదర్శనలు అదుర్స్



సురభి సభలో ప్రసంగిస్తున్న కలెక్టర్ ప్రధాన్

పర్లాకిమిడి: జిల్లాస్థాయి శిశు మహోత్సవం 'సురభి-2023' అదుర్స్ అనిపించింది. ప్రభుత్వ బడుల విద్యార్థులు మిల్లెట్స్‌తో తయారు చేసిన స్నాక్స్ తీసుకోవాలని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ సూచించారు. స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి సురభి శిశు మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు కళల్లోనూ ప్రవేశం పొందాలని, వారి ప్రతిభను ఇలాంటి వేదికలపై ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య శిక్షాధికారి ప్రదోష్ కుమార్ నాయక్, అదనపు విద్యాశాఖాధికారి మనోరంజన్ దొళాయి, మహారాజా బాలుర ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధాన ఉపాధ్యాయులు వై.ధర్మారావు తదితరులు పాల్గొని మాట్లాడారు.

పోటీలకు మోహన, ఆర్.ఉదయగిరి, నువాగడ, గుసాని, కాశీనగర్ నుంచి విద్యార్థులు తరలివచ్చి మహిళా స్వశక్తీకరణ, ప్రసూతి కేంద్రం నుంచి అత్తవారింటికి వచ్చే మహిళలు పడే అవస్థలు, దేశభక్తి, మిషన్ శక్తి వంటి ప్రభుత్వ పథకాలపై కూడా రూపకాలను విద్యార్థులు ప్రదర్శించారు. సురభి పోటీల్లో ఒడిశా సంగీతం, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు, వక్తృత్వం, హస్తాక్షర పోటీ, వితర్కం, ప్రబంధాలు, సృజనాత్మక రాతపై పోటీలు నిర్వహించారు. విజేతలకు కలెక్టర్, డీఈఓ బహుమతులు అందజేశారు. పోటీలకు ఉపాధ్యాయులు రమాకాంత పట్నాయిక్, అమూల్య పాణిగ్రాహి ముఖ్యవక్తలుగా వ్యవహరించారు.



పాటల పోటీలో పాడుతున్న చిన్నారి



జానపద నృత్యంతో మోహనా విద్యార్థినులు



ప్రసూతి గృహంలో మహిళలు పడే అవస్థలు..రూపకం



ప్రసూతి కేంద్రం రూపకంలో ఆర్.ఉదయగిరి విద్యార్థులు

అక్రమ గుట్కా తయారీ గుట్టురట్టు



దాడుల వివరాలు వెల్లడిస్తున్న సంజయ కుమార్ మహాపాత్రో

- కర్మాగారంపై పోలీసులు దాడులు
- ముగ్గురు అరెస్టు
- రూ. 8 లక్షల నగదు, 7 ప్యాకింగ్ మిషన్ల సీజ్

జయపురం: అక్రమ గుట్కా తయారీ గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా నడుస్తున్న కర్మాగారంపై దాడులు చేసి ముగ్గురిని అరెస్టు చేయడంతోపాటు ఎనిమిది లక్షల రూపాయల నగదు, ఏడు ప్యాకింగ్ మిషన్లను సీజ్ చేశారు. దీనికి సంబంధించి మాచ్‌ఖండ్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లమతాపుట్ జీడి పిక్కల ఫ్యాక్టరీ సమీపంలో ఒక ఇంట్లో పెద్ద ఎత్తున తయారవుతున్న గుట్కా ఖర్మాగారంపై సోమవారం మధ్యాహ్నం దాడులు చేపట్టామన్నారు. ఈ దాడిలో పెద్ద ఎత్తున మసాలా, సున్నం, ప్యాకింగ్ సామాన్లను పట్టుకున్నట్లు నందపూర్ సబ్‌డివిజన్ పోలీసు అధికారి సంజయ కుమార్ మహాపాత్రో తెలిపారు. దాడుల్లో కొరాపుట్ హటపాదర్ వాసి పి.సంతోష్, మధ్యప్రదేశ్ రాష్ట్రం చిందివాడ జిల్లాకు చెందిన సూరజ్ కవర్తి, ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర కాన్‌పూర్ జిల్లాకు చెందిన రవి శుకాలు పట్టుబడినట్టు వివరించారు. లమతాపుట్ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు చట్ట వ్యతిరేకంగా వివిధ కంపెనీల పేరుతో గుట్కాను అక్రమంగా తయారు చేసి వాటిని ప్యాకెట్లలో పెట్టి స్థానికుల ద్వారా వివిధ ప్రాంతాల్లో విక్రయించేందుకు రవాణా చేస్తున్నట్టు కొరాపుట్ జిల్లా ఎస్పీ అభినవ సోన్‌కర్‌కు విశ్వసనీయవర్గాల ద్వారా సమాచారం అందిందన్నారు. దీంతో విచారణ చేయాలని ఎస్పీ ఆదేశించడంతో నందపూర్, సునాబెడ ఎస్‌డీపీవోలు సంజయ కుమార్ మహాపాత్రో, మనోజ్‌కుమార్ బెహర, మాచ్‌ఖండ్ పోలీసు అధికారి డొంబురుదొర బత్రియలతో మూడు ప్రత్యేక బృందాలు పలు ప్రదేశాల్లో విచారణ చేశారన్నారు. చివరకు లమతాపుట్ ప్రాంతంలోని జీడి పిక్కల పరిశ్రమకు సమీపంలోని శంకరకుమార్ డాకువకు చెందిన వ్యక్తి ఇంటిని అద్దెకు తీసుకొని చట్టవిరుద్ధంగా గుట్కా తయారు చేసి విక్రయిస్తున్నట్టు తేలిందన్నారు. దాడుల్లో గుట్కా ప్యాకెట్లు తయారు చేసే ఏడు యంత్రాలను, గుట్కా తయారీ ముడిసరుకు మసాలా, సున్నం, ప్యాకింగ్ పౌచ్‌లు పెద్ద ఎత్తున గుర్తించామన్నారు. అలాగే ఎనిమిది లక్షల రూపాయలు పట్టుబడినట్టు వెల్లడించారు. ముగ్గురిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు. ఈ సంఘటనపై లమతాపుట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ చిత్తరంజన్ ప్రధాని దర్యాప్తు జరుపుతున్నట్లు నందపూర్ ఎస్‌డీపీవో సంజయ కుమార్ మహాపాత్రో వెల్లడించారు.



పట్టుబడిన గుట్కా తయారీ ముడిసరుకు



పట్టుబడిన మిషనరీ

నా భర్త జాడ తెలపండి



కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లిన గ్రామస్తులు

జయపురం: పొట్ట కూటి కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లిన కుములిపుట్ పంచాయతీ గొండాగుడ గ్రామానికి చెందిన ధన పూజారి అనే వ్యక్తి కనిపించడం లేదని, అతని ఆచూకీ కనుగొనాలని ధన పూజారి భార్య సోని పూజారి, కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఈ మేరకు వారు, గ్రామస్తులు ప్రముఖ సమాజ సేవకుడు బి.హరిరావు నేతృత్వంలో మంగళవారం కొరాపుట్ కలెక్టర్ అబ్దుల్ మహమ్మద్ అకతార్‌ను కలిసి విజ్ఞప్తి చేసి వినతి పత్రం అందజేశారు. ధనపూజారి ఆగస్టు 5న మల్కన్‌గిరి జిల్లా మత్తిలి పంచాయతీ గురుగుడ గ్రామానికి చెందిన దనుర్జయ పూజారి, అంబారా గ్రామానికి చెందిన ధనుర్జయ కమరలతో కలిసి వెళ్లారని, మిగిలిన ఇద్దరూ తిరిగి వచ్చేసినా ధన పూజారి మాత్రం ఇంటికి రాలేదని వారు తెలిపారు. దీనిపై ధన పూజారి భార్య సోని పూజారి బొరిగుమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని వినతి పత్రంలో పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ వెతికామని, అయినా జాడ తెలియలేదని విన్నవించారు. తన భర్త ఆచూకీ తెలుసుకునేందుకు సహకరించి న్యాయం చేయాలని కోరారు.

దోపిడీ దొంగల ఆటకట్టు



నిందితుల నుంచి సీజ్ చేసిన రెండు మోటారు బైక్‌లు

జయపురం: హొరడపుట్ సమీపంలోని ఒక పెట్రోల్ బంకును దోచుకునేందుకు దొంగలు వేసిన ప్లాన్‌ను జయపురం సదర్ పోలీసులు భగ్నం చేశారు. సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి తెలిపిన వివరాల మేరకు.. సోమవారం సాయంత్రం సబ్‌ఇన్‌స్పెక్టర్ రాజకిశోర్ బారిక్ నేతృత్వంలో అంబాగుడ ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్, వారెంట్ డ్రైవ్ జరుపుతున్నారు. అయితే ఓ దోపిడీ దొంగల ముఠా సంతతోటలో సమావేశమైందని, పెట్రోల్ బంకును దోచుకునేందుకు ప్లాన్ వేశారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు కుమిలిపుట్ సంతతోటకు వెళ్లి అక్కడ దొంగతనానికి సిద్ధమవుతున్న ఏడుగురిని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో నరేష్ హరిజన్(23), సిమన్ కుంజారియ(19), నరేంద్ర కుంజారియ(23), డేవిడ్ నాగ్(19), లక్ష్మణ హరిజన్(32), ప్రదీప్ గండ(19), అమన్ నాగ్(19) ఉన్నారని తెలిపారు. వారి నుంచి ఒక కంట్రీమేడ్ పిస్టోలు, రెండు కత్తులు, ఒక గొడ్డలి, ఏడు సెల్‌ఫోన్లు, రూ.9100 నగదు, రెండు బైక్‌లు సీజ్ చేసినట్లు తెలిపారు.

రాజీనామా చేస్తారా..?

భువనేశ్వర్: డిప్యూటీ స్పీకర్ పదవికి రజనీకాంత్ రాజీనామా చేస్తారనే ఊహాగానాలు విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. ఇంత వరకు అధికారిక ప్రకటన లేనప్పటికీ.. వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సంస్థాగత కార్యకలాపాల నిర్వహణ పూర్తి బాధ్యతలు ఆయనకు అప్పగించేందుకు బీజేడీ అధినాయకత్వం ఆలోచిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం స్పీకర్‌ను కలిసి తన రాజీనామాను సమర్పించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉంటే రాజకీయ కార్యకలాపాలు చేపట్టడం కష్టం. అందులోనూ రజనీకాంత్ సింగ్ అవిభక్త ఢెంకనాల్ జిల్లాలో అగ్ర శ్రేణి నాయకుడు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికలలో ఢెంకనాల్, అంగుల్ జిల్లాలతో కూడిన ఢెంకనాల్ లోక్‌సభ స్థానం నుంచి లేదా సంబల్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారని బలంగా ప్రచారం జరుగుతోంది. దీన్ని ఎదుర్కోవాలంటే క్షేత్రస్థాయిలో రజనీకాంత్ సింగ్ పనిచేయాల్సి ఉంటుంది. దీంతో ఆయన పదవి నుంచి దిగుతారని అంతా అనుకుంటున్నారు. అంగుల్ శాసన సభ నియోజకవర్గం నుంచి వరుసగా 4 సార్లు ఎన్నికైన రజనీకాంత్ సింగ్ 2019 సంవత్సరం జూన్ నెలలో రాష్ట్ర డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. అంతకుముందు నవీన్ పట్నాయక్ మంత్రి మండలిలో ఉక్కు, గనుల శాఖ మంత్రిగా పనిచేశారు.

సంద్రంలో పహారా



భువనేశ్వర్: రాష్ట్రంలోని ప్రముఖ నదీసముద్ర సంగమ తీర ప్రాంతాలకు బుల్లి తాబేళ్ల ఆగమనం పెరిగింది. ఈ నేపథ్యంలో అవి గుడ్లు పొదిగేంత వరకు పహారా ఏర్పాటు చేశారు. ఈ నెల 1వ తేదీ నుంచి ఆలివ్ రిడ్లే తాబేళ్లు గుడ్లు పెట్టే సీజన్ ఆరంభమైంది. దీంతో కోస్టు గార్డు, సాగర తీర థాణా పోలీసులు, అటవీ శాఖ భద్రతా వర్గాలు ఉమ్మడిగా తీర ప్రాంతాల్లో తాబేళ్లకు హాని కలిగించే మర పడవలపై నిఘా ఉంచాయి.

నేడు జగన్నాథుని బొనొకొ లగ్గి

- 4 గంటల పాటు దర్శనం నిలిపివేత

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరంలో బుధవారం జగన్నాథ స్వామి దర్శనం తాత్కాలికంగా నిలిపివేస్తారు. రత్న వేదికపై మూలవిరాట్టుల ముఖ అలంకరణ పురస్కరించుకుని బొనొకొ లగ్గి సేవ నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో 4 గంటల పాటు నిరవధికంగా భక్తులకు దర్శనం నిలిపివేస్తారు. బొనొకొ లగ్గి గోప్య సేవ కావడంతో ఈ మేరకు నిర్ణయించినట్లు శ్రీ మందిరం పాలక వర్గం పేర్కొంది. కార్తీక మాసం కృష్ణ పక్ష దశమి తిథి పురస్కరించుకుని బుధవారం ముఖ అలంకరణ సేవ నిర్వహిస్తున్నారు. దైనందిన సేవల్లో భాగమైన ద్వితీయ భోగమండపం తర్వాత సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులకు దర్శనాలకు అనుమతించరు.

పాలస్తీనాపై దాడులు దారుణం

జయపురం: పాలస్తీనాపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండించింది. మంగళవారం జయపురం కార్మిక భవనంలో కొరాపుట్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ దినం నిర్వహించారు. ముందుగా కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి జుధిస్టర్ రౌళో అరుణ పతాకాన్ని ఎగుర వేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రమోద్‌కుమార్ మహంతి మాట్లాడుతూ ఈ ఏడాది క్రాంతిదినాన్ని పాలస్తీనా సంఘీభావ దినంగా పాటిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బసంత బెహర, రామకృష్ణదాస్, నిత్యానంద పాత్రో, సన్యాసీ మాలి, గుప్త సాగరియ, భువనకుమార్, సత్యబ్రత నందొ, మమత సుక్రి, అనామ్ బాగ్, నీలకంఠ హరిజన్, శరత్ నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

రోప్ వే రెడీ



బారంగ్ నందన్ కానన్‌లో రోప్ వే సన్నద్ధత పరిశీలన

భువనేశ్వర్: నగరం శివారులోని బారంగ్ జంతు ప్రదర్శన శాల (నందన్ కానన్)లో రోప్ వే ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీని సన్నద్ధత పరిశీలన పూర్తయ్యింది. సందర్శకులు, పర్యాటకులకు కాంజియా సరస్సుపై రూ.13 కోట్ల వ్యయంతో రోప్ వే ఏర్పాటు చేశారు. 12 క్యాబిన్లు ఏర్పాటు చేశారు. ఒక్కో క్యాబిన్‌లో ఆరుగురు చొప్పున 12 క్యాబిన్లలో 72 మంది పర్యాటకులు రోప్ వే మార్గంలో విహరించేందుకు వీలవుతుంది.

క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని తిరుమల ఆస్పత్రి ఎం.డి డాక్టర్ కె.తిరుమల ప్రసాద్ అన్నారు. స్థానిక తిరుమల ఆస్పత్రిలో మంగళవారం రైలు ప్రమాద క్షతగాత్రుల కోసం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనిషి మాత్రమే రక్తదానం చేసి ప్రాణాలు కాపాడగలడని తెలిపారు. అనుకోని దుర్ఘటనలు జరిగినప్పుడు ప్రతి ఒక్కరు తమ వంతు సహాయాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పి.ఎస్.వి.రామారావు, డాక్టర్ మహేష్, అబ్దుల్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌ను సందర్శించిన హెచ్‌పీసీఎల్ రిటైర్డ్ జీఎం



రిటైర్డ్ జీఎం కృష్ణంరాజును సత్కరిస్తున్న చాన్సలర్ జీఎస్ఎన్ రాజు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయాన్ని హెచ్‌పీసీఎల్ విశ్రాంత జనరల్ మేనేజర్ కృష్ణంరాజు మంగళవారం సందర్శించారు. వర్సిటీలో పర్యటించి అమలు చేస్తున్న కోర్సులు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విశ్వ విద్యాలయం అమలు చేస్తోన్న నైపుణ్య కోర్సులు చాలా బాగున్నాయని ఆయన కితాబిచ్చారు. అనంతరం చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీసీ ప్రశాంత్‌కుమార్ మహంతి, రిజిస్ట్రార్ పల్లవి, ఐక్యూఏసీ డీన్ రమణారావు, డీన్ సన్నీ డియోల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్యదర్శికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో తీవ్ర గాయాలతో కార్యదర్శి శంకర్రావు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న డి.శంకర్రావు సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సతివాడ పోలింగ్ కేంద్రంలో బీఎల్ఓ విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో విజయనగరంలోని ద్వారపూడి బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న బైక్, కార్యదర్శి బైక్ బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కార్యదర్శి శంకర్రావుకు ఎడమ కన్ను పూర్తిగా పోవడంతో పాటు దవడ ఎముకలు విరిగిపోయాయి. స్పందించిన స్థానికులు క్షతగాత్రుడిని 108 సహకారంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పరిహారం



మాట్లాడుతున్న ఆర్‌డీవో సాయిశ్రీ

రామభద్రపురం: ప్రభుత్వ నింబధనల ప్రకారమే ప్రభుత్వం కొనుగోలు చేసిన భూములకు పరిహారం ఇవ్వడం జరుగుతుందని ఆర్‌డీవో సాయిశ్రీ తెలిపారు. మండలంలోని ఆరికతోట గ్రామాన్ని మంగళవారం సందర్శించిన ఆమె మెంటాడ మండలంలో ఏర్పాటు చేయనున్న గిరిజన వర్సిటీ రోడ్డు ఏర్పాటుకు అవసరమైన భూమి కోసం గ్రామ రైతులతో సమావేశమై, చర్చలు జరిపారు. ఆరికతోట రెవెన్యూ పరిధిలోని రైతులకు సంబంధించిన 98 సెంట్ల భూమి వర్సిటీ రోడ్డుకు అవసరమని, రైతులు భూమి ఇచ్చి, సహకరించాలని కోరారు. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, ల్యాండ్ ఎక్విజియేషన్‌లో భాగంగా ప్రభుత్వ నిబంధనల మేరకు భూమి పోగొట్టుకుంటున్న రైతులకు పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎ.సులోచనరాణి, దత్తిరాజేరు తహసీల్దారు రమేష్, మండల సర్వేయర్ చంద్రశేఖర్, వీఆర్‌వో శైలజ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఈవో సందర్శన

బొబ్బిలి: మండలంలోని చింతాడ గ్రామ పాఠశాలను డిప్యూటీ ఈవో పి.బ్రహ్మజీరావు మంగళవారం సందర్శించారు. తొలుత ఆయన పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. రుచి, శుచితో కలిగిన మధ్యాహ్న భోజనం రోజూ పిల్లలకు పెట్టాలన్నారు. అనంతరం వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలు గమనించారు.

ఎక్స్‌రేలు మితిమీరితే ప్రమాదం..!

- రేడియేషన్ బారిన పడే ఆస్కారం
- నేడు ప్రపంచ రేడియాలజీ దినోత్సవం

ఏడాదిలో తీసిన ఎక్స్‌రే, స్కాన్‌ల వివరాలు	
విభాగం	తీసిన సంఖ్య
ఎక్స్‌రే	2 లక్షలు
సిటిస్కాన్	25 వేలు
ఎంఆర్ఐ స్కాన్	15 వేలు
అల్ట్రాసౌండ్‌స్కాన్	1.20 లక్షలు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అల్ట్రాసౌండ్ స్కాన్ తీస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: సమాజంలో కొత్త కొత్త జబ్బులు పుట్టుకొస్తున్నాయి. రెండేళ్ల క్రితం కోవిడ్ మహమ్మారి యావత్ ప్రపంచాన్ని భయాందోళనకు గురి చేసింది. చెస్ట్ ఎక్స్‌రే, సి.టి స్కాన్ ద్వారా కోవిడ్ వ్యాధిని నిర్ధారించారు. వ్యాధి నిర్ధారణలో రేడియాలజీ ప్రధానమైనది. ఏవ్యక్తికి అయినా వ్యాధి నిర్ధారణ జరిగితే దానికి సంబంధించిన చికిత్స అందించడానికి వీలుంటుంది. ఎక్స్‌రేని కనుగొన్న రాంట్‌జెన్ పుట్టినరోజు అయిన నవంబర్ 8 వతేదీని ప్రపంచ రేడియాలజీ దినోత్సంగా నిర్వహిస్తారు.

రేడియాలజీ అంటే

ఎక్స్‌రే, సి.టి స్కాన్, అల్ట్రాసౌండ్ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్‌ను రేడియాలజీ అంటారు. ఏవ్యాధి నిర్ధారణ అయినా వీటి ద్వారానే జరుగుతుంది. వ్యాధి నిర్ధారణకు ఏది అవసరమైతే అది తీసి నిర్ధారిస్తారు. శరీరంలోని ఏ అవయవంలో నైనా సమస్య వస్తే సి.టి స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ చేసి నిర్ధారిస్తారు. గర్భంలో ఉన్న శిశువు ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడానికి, కడుపు నొప్పి ,కడుపులో ఏదైనా సమస్యలు ఉన్నప్పుడు అల్ట్రాసౌండ్ స్కాన్ ద్వారా నిర్ధారిస్తారు.

అవసరం మేరకు మాత్రమే ఎక్సరే తీసుకోవాలి

ఎవరైనా ఎక్స్‌రే గాని సి.టిస్కాన్ గాని అవసరం మేరకు మాత్రమే తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అనవసరంగా ఎక్స్‌రేలు, సి.టి స్కాన్ తీసుకుంటే రేడియేషన్ బారిన పడే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. కచ్చితంగా వ్యాధి నిర్ధారణకు ఎక్స్‌రే అవసరమని వైద్యుడు సూచిస్తేనే తీసుకోవాలి. అనవసరంగా ఎక్స్‌రేలు తీసుకుంటే కేన్సర్‌తో పాటు ఇతర రకాల సమస్యలు వచ్చే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు.

సర్వజన ఆస్పత్రిలో ఏడాదిలో తీసే ఎక్స్‌రేల వివరాలు

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఏడాదికి 30 వేల మంది వరకు ఎక్స్‌రేలు తీసుకుంటారు. అదేవిధంగా అల్ట్రా సౌండ్ స్కాన్‌లు 14 వేల మంది తీసుకుంటారు. ఎంఆర్ఐ స్కాన్ 2 వేలు, సి.టి.స్కాన్ 3 వేల వరకు తీస్తారు.

వ్యాధి నిర్ధారణలో రేడియాలజీ చాలా కీలకం



ఏదైనా వ్యాధిని అయినా నిర్ధారించాలంటే రేడియాలజీ ద్వారానే సాధ్యం. ఎక్స్‌రే, స్కానింగ్ ద్వారా వ్యాధిని నిర్ధారించిన తర్వాత మాత్రమే సంబంధిత వ్యాధికి చికిత్స అందించడానికి వీలుంటుంది.అయితే అవసరం లేకుండా ఎక్స్‌రేలు తీసుకోవడం మంచిది కాదు. రేడియేషన్, ఇతర సమస్యలకు గురయ్యే ప్రమాదముంది.

– డాక్టర్ లెక్కల వెంకట విశ్వనాథ ప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్, రేడియాలజీ విభాగం

పీహెచ్‌సీల్లో డెలివరీలు పెరగాలి



ఆస్పత్రి సిబ్బందితో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

కొత్తవలస: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెలివరీలు పెరిగేలా సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ అధికారి ఎస్.భాస్కర్‌రావు సూచించారు. ఈ మేరకు కొత్తవలస మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన మంగళవారం సందర్శించారు.

ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించి వారి పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో జరిగిన డెలివరీలు, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వచ్చిన ఆరోగ్యశ్రీ రిఫరల్స్, వైఎస్ఆర్ ఫ్యామిలీ డాక్టర్ వివరాలను ఈ ఆశ యాప్‌లో ఆశ కార్యకర్తలు నమోదు చేయాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి తగుజాగ్రత్తలు సూచించాలని చెప్పారు. వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డి.శీతల్‌వర్మ, సీహెచ్‌ఓ కృష్ణ, పీహెచ్‌ఎన్ ఎన్.రమణమ్మ,సిబ్బంది బేబిరాణి, సూరిదేముడు తదితరులు పాల్గొన్నారు.

ఓటీఎస్ ద్వారా బకాయి వ్యాట్ చెల్లింపు

- వాణిజ్యపన్నుల శాఖ అడిషనల్ కమిషనర్ శేఖర్



మాట్లాడుతున్న వాణిజ్యపన్నుల అడిషనల్ కమిషనర్ శేఖర్

విజయనగరం అర్బన్: జీఎస్‌టీ ప్రవేశ పెట్టక ముందు వ్యాట్ చట్టం అమలులో ఉన్నప్పుడు వ్యాపారులు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) ద్వారా చెల్లించే అంశాన్ని ప్రభుత్వ ఆలోచిస్తోందని వాణిజ్యపన్నుల శాఖ రీజినల్ జీఎస్‌టీ ఆడిట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం అడిషనల్ కమిషనర్ శేఖర్ అన్నారు. జీఎస్‌టీ చట్టంలో వ్యాపారుల సమస్యలు, ఇబ్బందులను తెలుసుకునేందుకు వాణిజ్య పన్నుల శాఖ స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన 'ట్రేడర్స్ మీట్' సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ బకాయిల చెల్లింపులపై ఇప్పటికే ఇతర రాష్ట్రాల వ్యాపార వర్గాల నుంచి సూచనలు వచ్చాయని, వాటితోపాటు మన రాష్ట్రంలోని వ్యాపార వర్గాల సూచనలను సేకరించి ప్రభుత్వానికి తెలియజేస్తామని సూచించారు. వ్యాపార వర్గాలు కేవలం ఇటువంటి సమావేశాలలోనే కాకుండా తమ అసోసియేషన్‌ల ద్వారా జాయింట్ కమిషనర్‌ను కలిసి తగు వివరణ పొందవచ్చని తెలిపారు. అనంతరం వివిధ వ్యాపార వర్గాల ప్రతినిధుల సందేహాలకు వివరణ ఇచ్చారు. వ్యాపార ప్రతినిధులు తెలియజేసిన ముఖ్య సమస్యలతో కూడిన మెమెరాండాన్ని అడిషనల్ కమిషనర్, జాయింట్ కమిషనర్‌లకు విజయనగరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాశ్, కమిటీ చైర్మన్ ఎం.చలం అందజేశారు. సమావేశంలో విజయనగరం డివిజన్ జాయింట్ కమిషనర్ బి.నాగార్జున రావు, చాంబర్ సహకార్యదర్శి బొడ్డు శ్రీనివాసరావు, చాంబర్ పాలకవర్గ సభ్యులు, ట్రేడ్ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

బంగారమ్మ తల్లిని దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: నగరంలోని వుడా కాలనీలో వేంచేసి ఉన్న రాజగిరి బంగారమ్మ తల్లి ఉత్సవాలలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మంగళవారం పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న వెంటనే ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. పులి వేషాలతో, డప్పు వాయిద్యాలతో ఆలయం వరకు తోడ్కొని వెళ్లారు. బంగారమ్మ మూలవిరాట్‌ను దర్శించుకున్న ఆయన కొద్దిసేపు ఉత్సవ నిర్వహణ గూర్చి కమిటీ సభ్యులతో చర్చించారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ మహాశక్తి స్వరూపిణి అయిన బంగారమ్మ తల్లి ఈ ప్రాంత ప్రజలకు చల్లగా కాపాడుతూ వస్తోందన్నారు. ఇదే నమ్మకంతో చుట్టు పక్కల ప్రాంతాల వారు ప్రతి ఏటా ఘనంగా బంగారమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నారన్నారు. స్థానిక పెద్దలు ఉత్సవ కమిటీగా ఏర్పడి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఆ తల్లి చల్లని దీవెనలు ప్రతి ఒక్కరిపైన ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణప్పడు, ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటరమణ, శంకరరావు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీ అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న రాజాం రూరల్ సీఐ శ్రీనివాసరావు

రాజాం సిటీ: ఇటీవల వరకు పనిచేసి డ్వాక్రా గ్రూపుల్లో అక్రమాలకు పాల్పడిన మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన ఆర్పీ ఉమాదేవిని బుధవారం అరెస్టు చేశామని రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన రూరల్‌స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. డ్వాక్రా గ్రూపుల్లో జరిగిన అవినీతికి ఆమె బాధ్యురాలిగా తమ దర్యాప్తులో వెల్లడైందన్నారు. మహిళలకు తెలియకుండానే లోన్లు వాడుకోవడం, సభ్యుల వద్ద వసూలు చేసిన లోను, పొదుపు మొత్తాలను బ్యాంకులో జమచేయకుండా సొంతానికి వాడుకుందని తెలిపారు. మెప్మా అధికారులు ఇచ్చిన దర్యాప్తు నివేదికలో ఉమాదేవి రూ. 64 లక్షల మేర అవినీతికి పాల్పడగా ఈ తంతు బయటపడిన అనంతరం రూ.8 లక్షలు వరకు బ్యాంకులో జమచేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. సభ్యులను విచారణ చేసిన అనంతరం ఆమె సుమారు రూ.36 లక్షల మేర అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించామని చెప్పారు. మెప్మా సీఓ దానాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామన్నారు. అరెస్ట్ చేసిన ఆర్పీని రాజాం కోర్టులో హాజరుపరచగా ఈ నెల 20 వరకు రిమాండ్ విధించడంతో జైలుకు తరలించినట్లు చెప్పారు. అలాగే మరో ఆర్పీపై కూడా విచారణ చేపట్టనున్నామని, మొత్తం వ్యవహారంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్‌ను విచారణ చేయాల్సి ఉందని, ఇటీవల ఆయన వేరే బ్యాంకుకు బదిలీ కావడంతో రీజనల్ మేనేజర్‌కు లేఖ రాశామని వెల్లడించారు. సమావేశంలో సంతకవిటి ఎస్సై బి.లోకేశ్వరరావు పాల్గొన్నారు.

10న నెహ్రూ యువకేంద్రంలో జాబ్‌మేళా

విజయనగరం అర్బన్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు ఈ నెల 10న స్థానిక నెహ్రూ యువ కేంద్రంలో జాబ్ మేళా నిర్వహిస్తామని జిల్లా ఉపాధి కార్యాలయ అధికారిణి డి.అరుణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రైవేటు లిమిటెడ్(తుని), మనప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ (విజయనగరం) సంస్థల్లో వివిధ కేడర్‌లో ఖాళీగా ఉన్న 160 పోస్టుల భర్తీకి ఆయా సంస్థ ప్రతినిధులు ఇంటర్వ్యూ నిర్వహిస్తారని తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్‌లోని ట్రైనీ (ప్రొడక్షన్/ఒఅండ్ ఎం) పోస్టుల కోసం 2017–2022 మధ్య డిప్లమో కెమికల్, బీఎస్సీ (కెమిస్ట్రీ), బీఎస్సీ (సీబీజెడ్) ఉత్తీర్ణులైన పురుష అభ్యర్థులు, మనప్పురం ఫైనాన్స్ లిమిటెడ్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్ కలెక్షన్ ఆఫీసర్ పోస్టు కోసం ఏదైనా డిగ్రీ అర్హత ఉన్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు'ఎన్‌సీఎస్.జీఓవి.ఐఎన్' వెబ్‌సైట్‌లో జాబ్ సీకర్ లాగిన్‌లో నమోదు చేసుకొని బయోడేటా, రెండు పాస్‌ఫొటోలతో ఆ రోజు ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు.

డ్వాక్రా బజార్ ప్రదర్శన నేడే ఆఖరు

విజయనగరం అర్బన్: పట్టణంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అఖిల భారత డ్వాక్రా బజార్ ప్రదర్శన బుధవారం ఒక్క రోజు మాత్రమే ఉంటుందని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.కల్యాణ చక్రవర్తి తెలిపారు. ఈ డ్వాక్రా బజార్‌లో తినుబండారాలు, హస్తకళలు, ఆభరణాలు, భీమాళి మామిడి తాండ్ర, రెడీమేడ్ దుస్తులు, అగరవత్తులు, పూజాసామగ్రి, మాప్‌స్టిక్స్, ఆయుర్వేద మందులకు తదితర ఉత్పత్తులకు సంబంధించి ఇప్పటివరకు సుమారు రూ.5.19 కోట్ల వ్యాపారం జరిగినట్లు చెప్పారు.

బీబీ విన్నర్ ఎంవీజీఆర్



విన్నర్‌గా నిలిచిన ఎంవీజీఆర్ కళాశాల జట్టు

డెంకాడ: మండలంలోని చింతలవలస ఎంవీజీఆర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్, సౌత్ జోన్ పోటీల్లో ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన టెక్కలి ఐతమ్ కళాశాల రన్నర్‌గా నిలిచింది. కార్యక్రమంలో జేఎన్‌టీయూ (విజయనగరం)పరిశీలకుడు పిఎస్‌వీ రమణ కమిటీ ప్రతినిధులు బి.రామయ్య, సీహెచ్ రవి, పీఎస్ సీతారామ రాజు, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ శేఖర్, డీన్ మోహన్‌కుమార్, పీడీ రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా

వీరఘట్టం: జొన్నపిక్కలు తీసుకువెళ్తున్న లారీ మండలంలోని కొట్టుగుమ్మడ–కిమ్మి బట్టి గట్టుపై అదుపుతప్పి మంగళవారం బోల్తా పడింది. కొట్టుగుమ్మడ, గడగమ్మ గ్రామాల్లోని రైతుల వద్ద కొందరు వ్యాపారులు 360 క్వింటాళ్ల జొన్న పిక్కలు కొనుగోలు చేసి లారీలో లోడ్ చేసి ఈ బట్టిగట్టుపై వెళ్తుండగా అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలో పడిపోయింది. ప్రమాదాన్ని గుర్తించిన లారీ డ్రైవర్, క్లీనర్లు బయటకు దూకేయడంతో ప్రాణాపాయం తప్పింది.

యువకుడి అదృశ్యం

భోగాపురం: మండలంలోని ఎ.రావివలస గ్రామానికి చెందిన మాగంటి వెంకటేష్(23) అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు. గత నెల 30న మద్యం తాగి ఇంటికి రావడంతో వెంకటేష్‌ను తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది ఇంటి నుంచి బయటకు వెళ్లి నేటివరకు రాకపోవడంతో యువకుడి తండ్రి సన్యాసిరావు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రాష్ట్రస్థాయి బీబీ పోటీలకు నలుగురు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ధర్మవరం విద్యార్థులు



సర్వేపల్లి స్కూల్ విద్యార్థులు



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

శృంగవరపుకోట: మండలంలో ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు పి.శ్రీరాములు మంగళవారం చెప్పారు. అండర్-14 విభాగంలో పోటీలకు వెలగల సాగర్, రాడి గాయత్రి, అండర్-17 విభాగంలో బూరాడ యోగి, వీరవరపు కావ్యలు ఎంపికయ్యారని, వారు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల అధ్యాపక సిబ్బంది అభినందించారు.

ఇద్దరు సర్వేపల్లి విద్యార్థులు

శృంగవరపుకోట పట్టణంలోని సర్వేపల్లి విద్యానికేతన్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పి.పైడిరాజు చెప్పారు. అండర్-17 విభాగంలో పి.త్రిష (ఖోఖో) వై.సరేంద్ర(బాస్కెట్‌బాల్)లు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించేందుకు అర్హత సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారిని స్కూల్ కరస్పాండెంట్ సన్యాసిరావు అభినందించారు.

ఖోఖో పోటీలకు పెదవేమలి విద్యార్థులు

గంట్యాడ: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు గంట్యాడ మండలంలోని పెదవేమలి విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 6వతేదీన గరివిడి మండలంలోని కోనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికలు జరిగాయి. ఈ పోటీల్లో పెదవేమలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు అండర్ 14, 17 కేటగిరిల్లో ఎంపికయ్యారు. అండర్-14 కేటగిరిలో పి.సంజన, ఎస్. శ్రీనివాస్, అండర్ 17 కేటగిరిలో రంధి లోకేష్, పి.ప్రసాద్, జి.అపర్ణ, జి.లక్ష్మీప్రసన్న ఎంపికైన వారిలో ఉన్నారు. అండర్-14 కేటగిరికి సంబంధించి ఈనెల 9వతేదీన చిత్తూరులో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు, అండర్ 17 కేటగిరికి సంబంధించి ఈనెల 16, 18 వతేదీల్లో కాకినాడలోని జేఎన్‌టీయూలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని పెదవేమలి జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ప్రసన్నకుమార్ తెలిపారు.

నెట్‌బాల్ పోటీలకు గొట్లాం విద్యార్థులు



నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొండపల్లి: రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు బొండపల్లి మండలంలోని గొట్లాంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న నలుగురు విద్యార్థులు ఎంపికై నట్లు హెచ్‌ఎం జీఎస్ఆర్.మూర్తి, పీడీలు యు.సత్యానంద్, ఎల్‌వీ రమణ తెలిపారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఎం.లిఖిత, ఎ.లేమియా, కె.రిషేంద్ర, ఎస్.సుశాంత్‌లను వారు అభినందించారు. ఈనెల 4న దత్తిరాజేరు మండలంలోని గడసాం హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెలలో నెల్లూరు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు.

వాలీబాల్ పోటీలకు దెందేరు విద్యార్థులు



రాష్టస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం సునీత, పీడీ కృష్ణంరాజు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పవన్

కొత్తవలస: ఈ నెల 9వ తేదీ నుంచి మూడు రోజుల పాటు అల్లూరిసీతారామరాజు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని దెందేరు హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు అండర్-14 విభాగంలో విరోతి నవీన్, కె.రాంచరణ్, గవర జయశ్రీ, జి.యోగితలు మంగళవారం పయనమయ్యారు. వారిని హెచ్‌ఎం బి.సునీత, పీడీ కె.కృష్ణంరాజులు అభినందించారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

దెందేరు హైస్కూల్ పూర్వ విద్యార్థి ,ప్రస్తుతం కొత్తవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న సాలాపు పవన్ అండర్-19 విభాగంలో జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ కృష్ణంరాజు తెలిపారు. ఈ నెల 4వ తేదీ నుంచి తిరుపతిలో రెండు రోజుల పాటు జరిగిన రాష్టస్థాయి పోటీల్లో విజయనగరం జిల్లా తరఫున పవన్ ఆడి బ్రాంజ్ మెడల్‌ను సాధించినట్లు చెప్పారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పవన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.ఈ మేరకు గ్రామ సర్పంచ్ విరోతి వెంకటరమణ, తదితరులు పవన్‌ను అభినందించారు.

శ్మశాన వాటిక స్థలం పరిశీలన



శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

జామి: మండలకేంద్రం జామిలో శ్మశాన వాటిక స్థలాన్ని ఆర్డీఓ సూర్యకళ మంగళవారం సందర్శించి పరిశీలించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో శ్మశాన వాటిక కోల్పోవడంతో వేరే స్థలాన్ని స్థానిక పెద్దల సహాయంతో తహసీల్దార్ హేమంత్‌కుమార్ గుర్తించారు. గుర్తించిన స్థలాన్ని అభివృద్ధి చేస్తామని హైవేసిబ్బంది హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోలేదని జామి సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఉపసర్పంచ్ అల్లు పద్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్డీఓ వచ్చి స్థలాన్ని పరిశీలించారు. సంబంధిత హైవే సిబ్బందితో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైవే కాంట్రాక్టర్ పీఎస్‌కే సంస్థ మేనేజర్‌తో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. దీంతో సంస్థ ప్రతినిధులు శ్మశానానికి కేటాయించిన స్థలాన్ని చదును చేసి అప్పగిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవానిరతి



మణికంఠకు చెక్ అందజేస్తున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో హోంగార్డుగా ఎంపికై, పోలీస్ శిక్షణ కళాశాలలో విధులు నిర్వహిస్తూ, ఇటీవల మృతిచెందిన పి.సూర్యప్రకాశరావు కుటుంబానికి జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డులు తమ సేవానిరతిని చాటుకున్నారు. ఈ మేరకు వారి ఒక్కరోజు వేతనం మొత్తం రూ.3 లక్షల46వేల480 చెక్కును అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ చేతుల మీదుగా సూర్యప్రకాశ్ కుమారుడు మణికంఠకు జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఆర్ఐ ఎస్.గోపాలనాయుడు, కార్యాలయ పర్యవేక్షకుడు ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ల చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

- 7 వాహనాల స్వాధీనం

సీతంపేట: ద్విచక్రవాహనాల చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, 7 టూవీలర్లను స్వాధీనం చేసుకున్నామని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ పాలకొండ, వీరఘట్టం ప్రాంతాలకు చెందిన చిన్నారావు, మురళీకృష్ణలు వ్యసనాలకు బానిసై డబ్బులకోసం బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ క్రమంలో సీతంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు ద్విచక్రవాహనాలు పోవడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు ఎస్సై నీలకంఠంతో పాటు సిబ్బంది దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకున్నారని చెప్పారు. సీతంపేటతో పాటు గజపతినగరం, కోటబొమ్మాళి, కొత్తూరు, పాలకొండ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో కూడా వారు ద్విచక్ర వాహనాలకు పాల్పడ్డారని వివరించారు.

బాణసంచా అక్రమంగా విక్రయిస్తే చర్యలు

దీపావళి సందర్భంగా బాణసంచా ఎక్కడైనా అక్రమంగా విక్రయించినా,తయారు చేసినా, నిల్వ ఉంచినా చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని, ఎక్కువ స్పీడ్‌తో, మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో ఎస్సై నీలకంఠరావు పాల్గొన్నారు.